క్లుప్తంగా

వాహనాల వేలం

అమలాపురం టౌన్: అమలాపురం, కొత్తపేట పోలీసు సబ్ డివిజన్ల పరిధిలోని పోలీసు స్టేషన్లలో పలు కేసుల్లో పట్టుకున్న వాహనాలకు ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు అమలాపురం డీఎస్పీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు డీఎస్పీ వై.మాధవరెడ్డి ఓ ప్రకటనతో తెలిపారు. జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ రోజు మొత్తం 13 వాహనాలకు వేలం పాట జరుగుతుందన్నారు. 11 ద్విచక్ర వాహనాలు, ఒక బొలేరో ట్రక్కు, ఒక కారులకు వేలం వేస్తారు. వేలంలో పాల్గొనే వారు తమ ఆధార్ కార్డుల జిరాక్సులతో వచ్చి ధరావత్తు సొమ్మును జమ చేయాలన్నారు. వేలంలో వాహనాన్ని దక్కించుకునేవారు పాడిన మొత్తం సొమ్ముతో పాటు 18 శాతం జీఎస్టీని కూడా చెల్లించాలని డీఎస్పీ మాధవరెడ్డి స్పష్టం చేశారు.

వెంకన్న హుండీల ఆదాయం రూ.15.84 లక్షలు

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను సోమవారం లెక్కించారు. 79 రోజులకు గాను హుండీల ద్వారా రూ.15.84 లక్షల ఆదాయం వచ్చింది. దేవాదాయ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, వానపల్లి పళ్లాలమ్మ దేవస్థాన ఈవో బొక్కా వీర వెంకటేశ్వరరావు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, ఎస్.మూలపాలెం సేవా సమితి భక్త బృంద ప్రతినిధుల సమక్షంలో హుండీలను తెరచి లెక్కించారు.

మంత్రి పరామర్శ



పాపారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: పితృవియోగంతో బాధపడుతున్న పేరూరు ఎంపీటీసీ సభ్యుడు న్యాయవాది చొల్లంగి సుబ్బిరామ్ కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పరామర్శించారు. ఇటీవల సుబ్బిరామ్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు పాపారావు (75) అనారోగ్యంతో మృతి చెందారు. పాపారావు మృతికి సంతాపం తెలిపి, ఆయన చిత్రపటానికి మంత్రి విశ్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి వెంట జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సర్పంచ్ దాసరి అరుణ, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, సూదా గణపతి, ఇళ్ల ఏడుకొండలు, సరెళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం




రక్తదానం చేస్తున్న ఎస్ఏఎఫ్‌కు చెందిన యువకులు

అమలాపురం టౌన్: శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక మద్దాలవారిపేట రక్తదాన శిబిరంలో ఆ సంస్థకు చెందిన 172 మంది యువకులు సోమవారం రక్తదానం చేశారు. ఎస్ఏఎఫ్ గౌరవాధ్యక్షుడు, శెట్టిబలిజ యువజన సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. అమలాపురంలోని ప్రభుత్వ ఆస్పత్రి రక్త నిధి, బుద్దాల నాగరత్నం వలంటీర్ బ్లడ్ బ్యాంక్‌లకు చెందిన సిబ్బంది ఆ యువకుల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన యువకులను సుభాష్ అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దొంగ శ్రీను, రాయుడు సత్యరుషి, ఎస్ఏఎఫ్ ప్రతినిధి కొప్పిశెట్టి రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ఐ.పోలవరం: స్థానిక పంచాయతీ కార్యదర్శి గోవిందురాజు తన పట్ల దురుసుగా ప్రవర్తించాడని జిల్లా మాలమహానాడు కార్యదర్శి రేవు శ్రీను సోమవారం ఎంపీడీఓ ఎ.లక్ష్మీరెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాల వద్ద పారిశుధ్యం మెరుగు పరచమని గతేడాది అక్టోబర్‌లో పంచాయతీలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు. ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో ఎందుకు చేయలేదని అడిగినందుకు గాను తనపై దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై పూర్తి విచారణ జరిపి కార్యదర్శిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏపీ సర్పంచ్‌ల సమాఖ్య కార్యవర్గ సభ్యుడిగా 'తిక్కిరెడ్డి'



అల్లవరం: ఏపీ రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య కార్యవర్గ సభ్యుడిగా ఎంట్రుకోన గ్రామ సర్పంచ్ తిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాసరావు నియమితులయ్యారు. సర్పంచ్‌ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు నుంచి నియామక ఉత్తర్వులు సోమవారం అందాయని శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటికీ రక్షిత తాగునీరు

- మంత్రి విశ్వరూప్
- దేవగుప్తంలో గడప గడపకూ..



దేవగుప్తంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి విశ్వరూప్



పల్లవారిపాలంలో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

అల్లవరం: జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. నోడల్ అధికారి సరోవరరావు ఆధ్వర్యంలో దేవగుప్తం గ్రామంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. బీసీ కాలనీకి పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేసేందుకు ఎంపీపీ స్కూల్ వద్ద 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మంత్రి విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళలతో మాట్లాడుతూ వేసవి నాటికి ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి పూర్తి స్థాయిలో తాగునీరు అందిస్తామని మంత్రి అన్నారు. అనంతరంగడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. సీఎం జగన్ అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ఇంటింటికీ తిరిగి మంత్రి విశ్వరూప్ వివరించారు. పేదల పెన్నిధి సీఎం జగన్‌ని వచ్చే ఎన్నికల్లో మరలా ఆశీర్వదించాలని మంత్రి కోరారు.

ప్రజలకు మేలు జరగాలంటే సీఎం జగన్ అధికారంలోకి రావాలన్నారు. ఇళ్ల స్థలాలు మంజూరైనా పట్టాలు ఇవ్వకుండా లబ్ధిదారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అర్హత ఉన్న వారికి ఇళ్ల పట్టాలు ఎందుకు ఇవ్వలేదని తహసీల్దార్ సాంబశివప్రసాదుని మంత్రి ప్రశ్నించారు. అర్హత ఉన్న వారికి పట్టాలు తక్షణమే ఇవాలని మంత్రి ఆదేశించారు. అనంతరం అరవచెరువలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. మంత్రి విశ్వరూప్‌తో పాటుగా ఆయన కుమారుడు పినిపే శ్రీకాంత్ గడప గడపకు కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఏపీ అగ్రిమిషన్ సభ్యుడు జున్నూరి రామారావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామారావు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, సెంట్రల్ డెల్టా చైర్మన్ కుడుపూడి బాబు, వైస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఉపసర్పంచ్ చిట్టూరి వెంకటలక్ష్మి, గ్రామకమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి సీఎం జగన్ : ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ముమ్మిడివరం: ప్రజాసంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలో పలవారిపాలెంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తమకు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఆరోగ్యబీమా, ఆరోగ్యశ్రీ, చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక వంటి పథకాలతో లక్షలాది రూపాయలు లబ్ధి చేకూరిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం జగనన్నకు జీవితాంతం రుణ పడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, వేగిరౌతు రాజబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హిత కారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఎంపీపీ కోలాగంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ, పార్టీ మండల కన్వీనర్ జగతా పద్మనాభం(బాబ్జి), రాయపురెడ్డి జానకీరామయ్య,పోలిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సభ్యుడు 'బులుసు'కు సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ తదితరులు

అమలాపురం రూరల్: పట్టణ లయన్స్ క్లబ్ హాల్‌లో పేరూరు గ్రామానికి చెందిన సీనియర్ లయన్స్ సభ్యుడు బులుసు సత్యనారాయణను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్‌వర్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. క్లబ్ కార్యదర్శి కాండ్రేగుల మల్లేశ్వరరావు, కోశాధికారి పంపన సూర్యతేజ, జోనల్ చైర్‌పర్సన్ బూరగాయల శివరామకృష్ణ, ఐ విజన్ చైర్‌పర్సన్ యర్రమిల్లి విశ్వేశ్వరరావు, ఐ విజన్ కార్యదర్శి పచ్చిగోళ్ల చినరామస్వామి, మోకా సుబ్బారావు పేరి లక్ష్మీనరసింహ, వరదా రాంబాబు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ గుర్రం రామకృష్ణ, సప్పా నాగేశ్వరరావు తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



కోరంగిలో సంక్రాంతి సంబరాలను తిలకిస్తున్న అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ



సంప్రదాయ దుస్తుల్లో అలరించిన చిన్నారులు



అమలాపురం సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు



హరిదాసులు, గంగిరెద్దుల సందడి

తాళ్లరేవు: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు జూదాలకు దూరంగా ఉండాలని, సాంప్రదాయ క్రీడల్లోనే పాల్గొనాలని కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ సూచించారు. కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి క్రీడా సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచెప్పే సంక్రాంతి పండగను ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. భోగిమంట వేసి బాలికలు మంట చుట్టూ నృత్యం చేస్తూ సందడి చేశారు. చిన్నారులు, మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, స్లో సైక్లింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివనారాయణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ పెయ్యల మంగేష్, వైఎస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి లలిత పాల్గొన్నారు.

కళాశాలలో సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్: స్థానిక యేడిద సత్యనారాయణ పీజీ కళాశాలలో సంక్రాంతి సంబరాలను విద్యార్థులు సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఈ సంబరాలను అంబరాన్నంటేలా చేపట్టారు. రంగవల్లులు తీర్చిదిద్దారు. పిండి వంటలు వండి ఘుమఘుమలాడించారు. గంగిరెద్దుల ప్రదర్శన ఏర్పాటు చేసి సందడి చేశారు. జోడెడ్ల బండిపై సవారీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగళపల్లి అరుణ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ సంబరాల్లో కళాశాల ప్రతినిధులు యేడిద నళినీకుమార్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోనసీమకు రైలు సాధనే సమితి లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న కోనసీమ యువ రైల్వే సాధన సమితి ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమకు రైలు సాధించడమే తమ అంతిమ లక్ష్యమని కోనసీమ యువ రైల్వే సాధన సమితి స్పష్టం చేసింది. ఆ సమితి ప్రతినిధులు స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఆ సమితి అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధా కొండలరావు మాట్లాడుతూ ఇక్కడ రైల్వే లైన్‌కు పునాది రాయి పడి రెండు దశాబ్దాలు దాటుతున్నా ఈ సీమ ప్రజల చిరకాల వాంఛగా ఉన్న రైలు మాత్రం రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే జరుగుతున్న మూడు నదీ పాయలపై వంతెనలు నిర్మాణ పనులు నిధుల విడుదల కాక కొన్ని రోజులుగా పనులు స్తంభించాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిధులు కేటాయించి ఆగిపోయిన పనులను పునః ప్రారంభించి వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీని కోసమే తమ సమితి ముఖ్యంగా కోనసీమలోని యువతను జాగృతం చేసి త్వరలోనే పార్టీలకు అతీతంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనుందని సమితి గౌరవాధ్యక్షుడు గొల్ల ప్రసన్నకుమార్ వెల్లడించారు. సమితి ప్రతినిధులు మద్దిశెట్టి ప్రసాద్, గాలిదేవర తమ్మేష్, పిండి రాజా, కొప్పుల నాగమానస తదితరులు పాల్గొన్నారు.

మండల బడ్జెట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ నిధులు రాబడులు, ఖర్చుల అంశాలను ఎంపీడీవో గౌరీకుమారి, ఏవో మూర్తి చదివి సభ్యులకు వినిపించారు. మండలంలో ప్రతి ఎంపీటీసీ సభ్యులకు గ్రామాల అభివృద్ధి నిమిత్తం రూ.2 లక్షల నిధులు కేటాయించినట్టు వివరించారు. ఈ బడ్జెట్ సమావేశాన్ని ఎంపీటీసీ సభ్యులు ఆమోదించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొని వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధిని వెల్లడించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పలు సమస్యలపై వివరణ కోరగా అధికారులు వాటిపై స్పందించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. 2023–24 సంవత్సరాల్లో వివిధ శాఖల నుంచి వచ్చే అంచనాల ప్రకారం వచ్చే ఆదాయం రూ.56.4195448 కోట్లు కాగా దీని నిమిత్తం రూ.56.4165648 కోట్లు ఖర్చవుతుందని, మిగులు బడ్జెట్‌గా రూ. 29,800 గా ఆమోదించారు. ఈ సమావేశం అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అధికారులు తనకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నడింపల్లి విజయలక్ష్మి, సాదే శ్రీనువాసరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



తమ సమస్యలను పరిష్కరించాలని ఎంపీ అనురాధకి వివరిస్తున్న కార్మిక సంఘాలు

అల్లవరం: ప్రజారోగ్య, విద్య, ప్రధానమంత్రి పోషణ శక్తి కార్యక్రమాల్లో భాగస్వామ్యంగా శక్తి వంచన లేకుండా విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఎన్‌హెచ్ఎం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘాలు ఎంపీ అనురాధని సోమవారం కలిసి విన్నవించుకున్నారు. 2009 నుంచి గౌరవ వేతనం పెంచకుండా కేంద్రం అన్యాయం చేస్తుందని, కరోనా సమయంలో ఎన్నో సేవలను అందించామని వివరించారు. కార్మికుల సమస్యలపై కేంద్ర ఆర్థిక మంత్రికి ప్రత్యేక లేఖ రాయాలని, పార్లమెంట్‌లో కార్మికుల సమస్యలపై ప్రస్తావించాలని ఎంపీని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ అనురాధ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అంగన్‌వాడీ, మిడ్డేమీల్స్ వర్కర్స్ పాల్గొన్నారు.

'షేర్‌వాల్' ఇళ్ల నిర్మాణంపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: ఆధునిక టెక్నాలజీతో షేర్‌వాల్ సంస్థ నిర్మిస్తున్న ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక నగర పంచాయతీ సమావేశ మందిరంలో సోమవారం పట్టణ గృహనిర్మాణ సంస్థ ఏఈ డి.శ్రీనివాస్ అధ్యక్షతన షేర్‌వాల్ సంస్థ నిర్మిస్తున్న ఇళ్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం భారంగా మారిన తరుణంలో షేర్‌వాల్ సంస్థ నూతన టెక్నాలజీతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, తక్కువ పెట్టుబడితో ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. షేర్ వాల్ సంస్థ ద్వారా పేద వర్గాలు ఇళ్లు నిర్మించుకొనే విధంగా ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని ఏఈ శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వేణు, పార్టీ నాయకుడు రెడ్డి శివన్నారాయణ, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం



మండల సమావేశానికి హాజరైన సభ్యులు

కాట్రేనికోన: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాలెపు లక్ష్మి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ సమావేశం వాడీవేడిగా జరిగింది. సభ్యులు పలు అంశాలపై చర్చించారు. రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని బంటుమిల్లి సర్పంచి గుత్తుల సత్యనారాయణ అధికారులను నిలదీశారు. కరోనా ఫోర్త్ వేవ్ నేపథ్యంలో మండలంలోని ప్రజలందరికీ బూస్టర్ డోస్ వ్యాక్సిన్ వేయాలని ఆరోగ్య శాఖ అధికారులకు జెడ్పీటీసీ నేల కిషోర్ కుమార్ సూచించారు. మండల సమావేశానికి పలు శాఖలకు చెందిన అధికారులు హాజరు కాలేదు. దీంతో సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, సెంట్రల్ డెల్టా చైర్మన్ యేడిది చక్రపాణీరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు నడింపల్లి సూరిబాబు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు యేడిది సుబ్బారావు, మోకా చంద్ర నాగరత్నం, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన



కేశనకుర్రులో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు గ్రామంలో వరి పొలాలను వ్యవసాయ శాఖ ఏడీ ఏవీఎస్ రాజశేఖర్, ఏఓ మనోహర్, ఏఓ ఎం.వాణి సోమవారం పరిశీలించారు. మండలంలో 7,298 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేసినట్లు తెలిపారు. నాట్లు వేసిన పొలాలను పరిశీలించి పంటను కాండం తొలుచు పురుగు ఆశించనట్లు, జింక్ లోపం ఉన్నట్లు గుర్తించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు, కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ మందు వాడాలని రైతులకు సూచించారు. జింక్ లోపం నివారణకు జింక్ సల్ఫేట్ లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున ఎకరాకు రెండు వందల లీటర్లు వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు కమ్మ సుబ్బారావు, బొంతు శ్రీనివాసరావు, తొత్తరమూడి నరసింహమూర్తి, వాశంసెట్టి వెంకటేశ్వరావుల పొలాలను పరిశీలించిన అధికారులు రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

పౌష్టికాహార కిట్ల అందజేత



పేరూరులో బాలింతలకు కిట్లు అందిస్తున్న సర్పంచ్ దాసరి అరుణ

అమలాపురం రూరల్: పేరూరు గౌతమీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జగనన్న సంపూర్ణ పౌష్టికాహార కిట్లను గర్భిణులకు, బాలింతలకు సర్పంచ్ దాసరి అరుణ సోమవారం అందించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం కిట్లు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యం ఉండాలన్నారు. ప్రతి నెలా వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కామేశ్వరరావు, సత్యనారాయణ, రామారావు భీమశంకర్ అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: బెండమూర్లంక సబ్ స్టేషన్ పరిధిలోని బెండమూర్లంక, ఓడలరేవు, తుమ్మలపల్లి, మొగళ్లమూరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈఈ రవికుమార్ సోమవారం తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువతి కిడ్నాప్‌పై కేసు

అయినవిల్లి: ఓ యువతి కిడ్నాప్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన పదహారు సంవత్సరాల యువతిని రాజమహేంద్రవరానికి చెందిన అన్నెం రాజు కిడ్నాప్ చేసినట్లు యువతి తాతయ్య అయినవిల్లి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌పై ఫిర్యాదు

కాట్రేనికోన: రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణతో వెలువడే దుర్వాసన భరించలేక పోతున్నామని, తక్షణమే యూనిట్‌ను నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక పీఎస్ఆర్ కాలనీకి చెందిన పలువురు సోమవారం జిల్లా గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ధాన్యచంద్రకు ఫిర్యాదు చేశారు. కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయానికి ఎదురుగా నివాస ప్రాంతాలకు మధ్యలో మల్లాడి వెంకటేశ్వరరావు రొయ్యలు, చేపలు కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం నుంచి వచ్చే దుర్వాసన, వ్యర్థాలతో పిల్లలు, మహిళలు అనారోగ్యం పాలవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై జేసీ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కామేశ్వరరావు కాట్రేనికోనలో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలించారు. స్థానికుల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా ఉన్న రొయ్యలు కొనుగోలు కేంద్రం యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. జేసీకి ఫిర్యాదు చేసిన వారిలో యేళ్ల పల్లంరాజు, కొంకి శంభుడు, వట్టూరి దుర్గామహేష్, పరమట అప్పారావు తదితరులు ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధం

ఉప్పలగుప్తం: అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమైన సంఘటన మండలంలోని వానపల్లిపాలెం పంచాయతీ పరిధి బీవీ రమణయ్యనగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జొన్నాడ వీరాస్వామి తనకున్న తాటాకింటిలో ఓ పక్క తన కుటుంబంతో నివాసం ఉంటూ, మరో పక్క పశువులను కడుతున్నాడు. సాయంత్రం వేళలో పశువులను దోమలు నుంచి రక్షించడానికి పొగ పెట్టి తను పనిలో నిమగ్నమయ్యాడు. ఇంతలో గాలికి నిప్పురవ్వలు చెదిరి తాటాకింటికి తగిలి మంటలు చెలరేగాయి. ఆ విషయాన్ని గమనించిన స్థానికులు సహకారం అందించి మంటలను అదుపుచేశారు. మనుషులకు, పశువులకు ఎటువంటి ప్రమాదం జరగనప్పటికీ, సుమారుగా రూ.30 వేలు వరకు ఆస్తి నష్టం ఉంటుందని స్థానిక వీఆర్వో మమత తెలిపారు.